## నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: 11కేవీ ఎంఐజీ చిత్రపురికాలనీ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి విద్యుత్‌ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంఐజీ, హెచ్‌ఐజీ, చిత్రపురికాలనీ, అపార్ట్‌మెంట్ల ప్రాంతంలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.
-11 కేవీ శ్రీరామ స్కూల్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీరామస్కూల్‌, నానక్‌రాంగూడ, ఎస్‌బీఐలేన్‌, విప్రో సర్కిల్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కూరగాయల ధరలు..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 50, ఆలు 30, చామ 50, కీర 35, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్‌ 50, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 50, క్యాబేజీ 20, క్యారెట్‌ 40, చిక్కుడు 40, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300.

## హైటెక్స్‌లో ముగిసిన కిసాన్‌ అగ్రి షో



కార్యక్రమంలో పాల్గొన్న సందర్శకులు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న కిసాన్‌ 2025 వ్యవసాయ ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. సెలవు రోజు కావడంతో వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో నూతన పాల్గొన్నారు. నూతన పద్ధతుల్లో వ్యవసాయం తదితర విధానాలను అడిగి తెలుసుకున్నారు. యంత్రపరికరాలు, పని ముట్లను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు.

## న్యాక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని నేషనల్‌ అకాడమీ ఆఫ్‌ కన్‌స్ట్రక్షన్‌ హైదరాబాద్‌ నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో నాణ్యమైన శిక్షణతో 100శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్‌, యాంకరింగ్‌, డబ్బింగ్‌, వాయిస్‌ ఓవర్‌ స్కిల్స్‌ కోర్సుల కొరకు 900149225, లాండ్‌ స్కేప్‌ డిజైన్‌ , ఇంటీరియర్‌ డిజైన్‌ కోర్సు కొరకు 9063208703, స్టోర్‌ కీపర్‌ కోర్సులకు 9676706414, యంఈపీ, ఫినిషింగ్‌ స్కూల్‌ కోర్సు నిమిత్తం 7097114947 ఫోన్‌ నెంబర్లలో సంప్రదించి రిజిస్టర్‌ చేసుకోగలరు. ఈనెల మూడవ వారంలో తరగతులు ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రోడ్డు పనులు ప్రారంభించండి

పటాన్‌చెరు టౌన్‌: బొంబాయి హైవే నుంచి చందానగర్‌ మీదుగా.. రెడ్డికాలనీ, బంధం కొమ్ము నుంచి అమీన్‌పూర్‌ వెళ్లే ప్రధాన రహదారి పనులను పునః ప్రారంభించాలని సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. గత నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రోడ్డు పనులు చేపట్టకుంటే కాలనీవాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు జార్జ్‌, వీరస్వామి అనంతరావు, శ్రీనివాసరెడ్డి, మణిరాజు, సునీత, ప్రజలు పాల్గొన్నారు.

## నేడు రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో 'ప్రజావాణి'

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ డా. రవి కుమార్‌ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్‌ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్‌ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఔటర్‌పై కార్లతో విన్యాసాలు

శంషాబాద్‌ రూరల్‌: ఔటర్‌ రింగ్‌ రోడ్డుపై అర్ధరాత్రి కార్లతో విన్యాసాలు చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తొండుపల్లి ఔటర్‌ ఎగ్జిట్‌ 16, పెద్ద గోల్కొండ ఔటర్‌ ఎగ్జిట్‌ 15 మధ్యలో ఔటర్‌పై శనివారం అర్ధరాత్రి రెండు కార్లతో గుర్తు తెలియని వ్యక్తులు విన్యాసాలు చేస్తున్నారు. పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సిబ్బందికి సమాచారం రాకవడంతో అక్కడకు చేరుకునే లోపు కార్లతో పారిపోయారు. కార్లతో విన్యాసాలు చేసిన వారికోసం గాలిస్తున్నారు.

# ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తాం



గురునాథం చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

మియాపూర్‌: నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురునాథం చెరువును అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చిన నెక్సెస్‌ సెలెక్ట్‌ మాల్‌ కంపెనీ, మల్లిగావార్డు ఫౌండేషన్‌ నిర్వాహకులను అభినందించారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న గురునాథం చెరువు సమస్యకు నేటితో శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. చెరువు పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాంబొట్ల, చైతన్య, కాలనీ వాసులు రమేష్‌, అవినాష్‌, లోకేష్‌, నాగ సుబ్బారెడ్డి, కార్తికేయా, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

### సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గచ్చిబౌలి: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్‌ డివిజన్‌లోని శిల్పాపార్కుకాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రూ.9.20 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 48 సీసీ కెమరాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక సీసీ కెమరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. కేసుల పరిష్కారంలో సీసీ కెమెరాలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. కాలనీవాసులు సీసీకెమరాలు ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. శాంతి భద్రతలు కాపాడడం లో పోలీసు అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, నాయకులు శ్రీనివాస్‌యాదవ్‌, కాలనీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి లవకుమార్‌, కోశాధికారి అమర్‌నాథ్‌, సంయుక్త కార్యదర్శి గుప్తాజీ, కాలనీవాసులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రంగనాథుడికి ప్రత్యేక అభిషేకం



రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, పూజలు, అలంకారం చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన, సామూహిక విష్ణు సహస్రనామపారాయణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి ప్రత్యేక పల్లకిసేవా, వాహనసేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**నేడు రథోత్సవం...**

రంగనాథుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రథోత్సవం సోమవారం జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయ రథాన్ని అందంగా తీర్చిదిద్దారు. సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### రంగనాథుడి సేవలో పద్మభూషణ్‌ స్వప్నసుందరి



రాయదుర్గం: నానక్‌ రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల్లో ఆదివారం ప్రముఖ నృత్యకారిణి, పద్మభూషణ్‌ స్వప్నసుందరి పాల్గొన్నారు. ఎన్నో రంగనాథుడి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న ఆమె ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం స్వామివారి వాహనసేవలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె స్వామివారిని, మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్‌: కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్‌ పరిధిలోని అరబిందో కాలనీ అసోసియేషన్‌ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... కాలనీలో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారంకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సమావేశంలో అసోసియేషన్‌ సభ్యులు నారాయణరెడ్డి, లోకేష్‌, రమేష్‌, కెఎస్‌. బాబు, దిలీఫ్‌, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్‌, అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, భక్తులు

గచ్చిబౌలి: కొండాపూర్‌ పరిధి కొత్తగూడలో వెలిసిన అలిమేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనను ఆశీర్వదించగా, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



ఈ కార్యక్రమంలో నాయకులు ఊట్ల కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్‌, ఊట్ల దశరథ్‌, మణిరత్నం, లక్ష్మణ్‌, శ్రీనివాస్‌, సంతోష్‌, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్‌: దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌ పరిధిలోని చైతన్యనగర్‌లోని మహదేవుడి ఆలయంలో వంటశాల షెడ్‌ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రతాప్‌గౌడ్‌, కొమర గూడెం వెంకటేష్‌, మల్లేశ్‌యాదవ్‌, సంతోష్‌గౌడ్‌ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ ఏర్పాటు

జిన్నారం (పటాన్‌చెరు): డంపింగ్‌ యార్డ్‌ వ్యతిరేక పోరాట జేఏసీ సంఘం ఏర్పాటైంది. గుమ్మడిదల మండలంలోని అఖిలపక్షం, ప్రజా సంఘాలు, విద్యార్థి కార్మిక రైతు సంఘాల ప్రతినిధులతో ఆదివారం జేఏసీ ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమ పోరాటం తరహాలోనే జేఏసీ పనిచేస్తుందని ఆ సంఘం నేతలు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ జేఏసీ ఆధ్వర్యంలో నేటి నుంచి రోడ్డుపై బైఠాయించి వంటావార్పు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

### 'కాలనీ అభివృద్ధికి కృషి'

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ న్యూ రామారావు నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాంరెడ్డి విజయం సాధించారు. ఆదివారం కమిటీ హాల్‌లో ఎన్నికల అధికారి పోతురాజు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ సబీహా బేగం సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా మూసాపేట డివిజన్‌ కబీర్‌నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జోసెఫ్‌ కిరీటన్‌ విజయం సాధించారు.

# ముగిసిన ఒడిశా ఫుడ్‌ అండ్‌ క్రాఫ్ట్‌ మేళా



శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్‌: ఒడిశా పిండి వంటలను నగరవాసులు రుచి చూసి అభినందించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఒడిశా ఫుడ్‌ అండ్‌ క్రాఫ్ట్‌ మేళా ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ఒడిశాకు చెందిన వ్యక్తులు కుటుంబాలతో సహా హాజరయ్యారు. కథక్‌, ఒడిస్సీ, సంబల్పూరి, ఒరియా జానపద పాటలు సందర్శకులను ఆలరించాయి. కోటపాడు, నూనపాట్న, సంతాలీ ట్రిబల్‌ చీరలు ఆకట్టుకున్నాయి. దహిబర అలూదమ్‌, రసగుల్లా, ముదిమాంశో, చిన్నపోడ తదితర వంటకాలు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో డాక్టర్‌ సౌమ్య మిశ్రా, డాక్టర్‌ భరత్‌పురోహిత్‌, పద్మశ్రీ పతయత్‌ సాహు, సిద్ధార్థ్‌ మొహంతి, డాక్టర్‌ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

### కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఆల్విన్‌కాలనీ: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌ పాపిరెడ్డినగర్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన ఊట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీని ఆయన నివాసంలో కాలనీ వాసులు కలిశారు. అధ్యక్షుడిని ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డినగర్‌ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మాస్టర్స్‌ విజేతలకు సత్కారం



విజేతలను అభినందిస్తున్న కొండ విజయ్‌కుమార్‌

చందానగర్‌: ఇటీవల కేరళ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్‌ పోటీలలో పతకాలు సాధించిన విజేతలను తెలంగాణ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిలాల మాస్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్‌ ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా చందానగర్‌ హుడా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో పోటీల్లో మరిన్ని పతకాలు సాధించేందుకు స్టేడియంలో శిక్షణ ఇస్తామన్నారు. క్రీడాకారులు 21 పతకాలు సాధించారని, అందులో 7 బంగారు, 7 రజతం, 7 కాంస్యం పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. సత్కారం అందుకున్న వారిలో పీజేఆర్‌ స్టేడియం, ఇతర జిల్లాల్లో శిక్షణ పొందిన అజయ్‌కుమార్‌, రామారావు, ఏసురత్నం, నాగలక్ష్మి, స్వాతి, మానసపతి, శివాలీలారెడ్డి, స్వాతి గౌడ్‌, జయలక్ష్మి, మల్లేశ్వరి,శైలజ, భవానీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్‌, ట్రెజరర్‌ స్వాతితో పాటు మాస్టర్స్‌ పాల్గొన్నారు.

### ముగిసిన సాయిబాబా ఆలయ వేడుకలు

మోతీనగర్‌: సద్గురు సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా రెండవ రోజు కాగడ హారతి, శతకటాభిషేకం, అలంకరణ, అర్చన, సామూహిక శ్రీ సత్యదేవుని వ్రతం, మధ్యాహ్నం హారతి, అన్న సమారా ధన, సంధ్యా హారతి, విష్ణు సహస్రనామ పారాయణ, భజన, పల్లకీ సేవ తదితర పూజలు నిర్వహించారు.



# చిత్రపురి సమస్యలు పరిష్కరించాలి

మణికొండ: మున్సిపాలిటీ పరిధి చిత్రపురికాలనీలో రోడ్లు, వీధి దీపాలు, నీటి ఎద్దడి సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. సీతారాం, నరేందర్‌ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రపురిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చిత్రపురిలో పలు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా హౌసింగ్‌ సొసైటీ, మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ నిధులతో నిర్మించనున్న పనులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. బస్తీ దవాఖానాలో సరైన సిబ్బంది లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రినాయుడు, విఠల్‌, రమణమూర్తి, కిరణ్‌, బాలాజీ, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌, రామసుబ్బారెడ్డి, సందీప్‌, సుమ నళిని, శ్రీధర్‌, తిరుపతి పాల్గొన్నారు.

# సీఆర్‌ పాలీ క్లినిక్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చందానగర్‌: కొండాపూర్‌ చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్‌ ఫర్‌ సోషల్‌ ప్రోగ్రెస్‌ నిర్వహిస్తున్న సీఆర్‌ పాలీ క్లినిక్‌ ఆధ్వర్యంలో శిల్పా పార్క్‌ క్రికెట్‌ గ్రౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌ ఫౌండేషన్‌ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌ రెడ్డి, శిల్పా పార్క్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు యమని నవీన్‌ మాట్లాడుతూ పాలి క్లినిక్‌లో అతి తక్కువ రుసుముతో వైద్య సేవలు, అన్ని రకాల వైద్య పరీక్షలు అందిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లినిక్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రజిని, సీనియర్‌ గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ అరుణ, వైద్యులు కేజియ, దంత వైద్యులు అజయ్‌, ప్రశాంతి, ఎల్వీ ప్రసాద్‌ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అలరించిన మెరివాగంజా -2025



కార్నివాల్‌లో పాల్గొన్న విద్యార్థులు



మాదాపూర్‌: మెరిడియన్‌ స్కూల్‌ విద్యార్థులు నిర్వహించిన కార్నివాల్‌ ఉత్సాహంగా సాగింది. మాదాపూర్‌లోని మెరిడియన్‌ స్కూల్‌లో ఆదివారం మెరివాగంజా -2025 కార్నివాల్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్‌ మాబ్‌ తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సవారీలు, ఇంటరాక్టివ్‌ బోర్డు ఆటలు, లక్కీడ్రాలలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి చదువులో రాణించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాసంస్థల ఫౌండర్‌ బుట్టా రేణుక తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ కరణం భవాని, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రామచంద్రాపురం (పటాన్‌చెరు): భద్రత నియమాలు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డైరెక్టర్‌ ఆఫ్‌ ఫ్యాక్టరీస్‌ తెలంగాణ, నేషనల్‌ సేఫ్టీ కౌన్సిల్‌ చైర్మన్‌ తెలంగాణ చాప్టర్‌ రాజగోపాల్‌ రావు అన్నారు. ఆదివారం బీహెచ్‌ఈఎల్‌ కమ్యూనిటీ సెంటర్‌లో పర్యావరణ పరిరక్షణ, గృహిణిల భద్రతపై నిర్వహించిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలోని ప్రతిభను బయటకు తీసిన వారమవుతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేసినప్పుడే భవిష్యత్‌ తరాలకు మంచి వాతావరణం ఇవ్వగలమని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ భద్రత కౌన్సిల్‌ కోశాధికారి సత్యబాబు, అధికారులు గౌరీశంకర్‌, భెల్‌ అధికారులు ప్రవీణ్‌ కుమార్‌, శ్రీనివాసరావు, విజయసాగర్‌, అరవింద్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఓర్పు, నేర్పుతో సాధన చేస్తే విజయం తథ్యం



అన్నమాచార్య విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న శోభారాజు

బండ్లగూడ: ఓర్పు, నేర్పుతో సాధన చేస్తే విజయం వరిస్తుందని పద్మశ్రీ డాక్టర్‌ శోభారాజు అన్నారు. బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి హైదర్షాకోట్‌లోని కుందన మ్యూజిక్‌ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లపాక అన్నమాచార్య పంచలోగ విగ్రహ ప్రతిష్ఠాపనలో శోభారాజు పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగీతం నేర్చుకోవడంతో భక్తిభావం పెరుగుతుందన్నారు. కుందన మ్యూజిక్‌ అకాడమీ దినదిన ప్రవర్తమానం కావాలని, పిల్లలకు మరెన్నో కీర్తనలు నేర్పించి మంచి కళాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. కుందన మ్యూజిక్‌ అకాడమీ అధినేత సాలూరి సతీష్‌ పద్మశ్రీ డాక్టర్‌ శోభారాజు అనుమతితో పలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంకటేష్‌, ఏసీపీ సత్యనారాయణ, సీఐ సురేష్‌ పలువురు సంగీత ప్రియులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

### చెత్తకు నిప్పు.. ఎగిసిపడ్డ మంటలు



కేపీహెచ్‌బీకాలనీ: రోడ్డు పక్కన ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కేపీహెచ్‌బీకాలనీ ఐదవ ఫేజ్‌ నుంచి నాలుగవ ఫేజుకు వెళ్లే దారిలో ఆదివారం సాయంత్రం రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్తాచెదారం, ఎండు కొమ్మలు వంటి వాటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు ఆందోళన చెందారు. అటుగా పోయే వాహనదారులు సైతం మంటలను చూసి భయంతో ఆగిపోయారు. మంటలు ఎగిసిపడటానికి అక్కడే ఉన్న కేబుల్‌ తవ్వకాలలో వినియోగించే కొన్ని పైపులు కూడా కారణమని తెలుస్తోంది. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసిన వ్యక్తులే నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. కొద్దిసేపటికి మంటలు అదుపులోకి రావటంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి.